సాక్షి
ప్రకాశం
శనివారం, 9, మార్చి, 2024



వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

ఒంగోలు నగరానికి చెందిన పలువురు బాలినేని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.

- 8లో..



మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం 34/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

నీలకంధరా..నాగాభరణా..



ఒంగోలులోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



సంతపేట సాయిబాబా ఆలయంలో ప్రత్యేక అలంకరణలో శివపార్వతులు

నీలకంధరా..నాగాభరణా.. భజే రుద్రాయ అంటూ శివనామస్మరణతో జిల్లా హోరెత్తింది. శైవక్షేత్రాలన్నీ భక్త జనసంద్రమయ్యాయి. ఆదిభిక్షువు దివ్య దర్శనంతో భక్తజనం పులకించిపోయింది. భోళా శంకరా..ముక్కంటీ నీ చల్లని దృక్కులు మాపై ప్రసరించి చల్లగచూడు స్వామీ అంటూ పరమేశ్వరుడిని వేడుకున్నారు. బిల్వార్చనలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా శుక్రవారం జిల్లాలోని శైవక్షేత్రాలు భైరవకోన, త్రిపురాంతకేశ్వరాలయం, ఒంగోలు నగరంలోని కొండమీద కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, సంతపేట శివాలయం, కొత్తపట్నం బస్టాండ్ సమీపంలోని శివాలయాలతో పాటు మిట్ట పాలెం నారాయణస్వామి ఆలయం, జమ్ములపాలెం, మడనూరుల్లో ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు.

- సాక్షి నెట్‌వర్క్





భైరవకోనలోని త్రిముఖదుర్గాంబిక, భైరవేశ్వరస్వామి



భైరవకోనలో స్వామిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు



త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరస్వామి, దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు

న్యూస్‌రీల్

సత్తాచాటిన బాపట్ల జిల్లా ఎడ్ల జతలు



రామాపురంలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి

రాచర్ల: రాచర్ల మండలంలోని గుడిమెట్ట పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామ సమీపంలోని సిద్ధిభైరవేశ్వరస్వామి వారి మహాశివ రాత్రి తిరుణాల మహోత్సవం సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీల్లో బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన వీరయ్యస్వామి చౌదరి ఎడ్ల జతలు సత్తాచాటాయి. రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలను మార్కాపురం ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కందురు నాగార్జున రెడ్డి ప్రారంభించారు. ఈ ఎడ్ల పోటీల్లో మొత్తం 7 జతల ఎడ్లు పాల్గొనగా బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన వీరయ్యస్వామి చౌదరికి చెందిన ఎడ్లు నిర్ణీత 15 నిమిషాల్లో 1635 అడుగులు లాగి మొదటి బహుమతి సాధించాయి. గిద్దలూరు మండలం కొండపేట గ్రామానికి చెందిన మీనిగ కాశయ్య ఎడ్లు 1515 అడుగులు లాగి రెండవ బహుమతి సాధించగా, నంద్యాల జిల్లా శిరివెల్ల మండలం మెత కూరిపల్లి గ్రామానికి చెందిన బత్తుల బాలారాజు ఎడ్ల జతలు 1500 అడుగులు లాగి మూడో స్థానం, బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన వీరయ్యస్వామి చౌదరి చెందిన ఎడ్ల జతలు 1237 అడుగులు లాగి నాల్గవ బహుమతి సాధించాయి. ఎడ్ల పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.10 వేలను ఎడ్ల యజమానులకు దేవస్థానం ధర్మకర్త మధిరె శ్రీరంగారెడ్డి, ఉప ధర్మకర్త శ్రీరంగపు వెంకట నారాయణరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో సత్తాచాటిన గిద్దలూరు ఎడ్లు

అర్ధవీడు (కంభం): భద్రకాళీసమేత వీరభద్ర స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా మండలంలోని చిన్నకంభం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీల్లో గిద్దలూరు మండలం అక్కలరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కూతుర్ల దక్షిత్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి ఎడ్లజత 3252.9 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా బుగ్గణపల్లి గ్రామానికి చెందిన బుక్కా నాగేంద్రయాదవ్, అర్ధవీడు మండలం నారాయణపల్లికి చెందిన జంగాల దివ్యశ్రీ ఎడ్లు 3 వేల అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, కొమరోలు మండలం పామూరిపల్లి గ్రామానికి చెందిన గోపు రమణారెడ్డి ఎడ్లు 2894.10 అడుగుల దూరం లాగి మూడో స్థానం, గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన కార్తికేయచౌదరి ఎడ్ల్ 2743.4 అడుగుల దూరం లాగి నాల్గవస్థానం, వైఎస్సార్ జిల్లా కలసపాడుకు చెందిన చేతి వెంకటరెడ్డి ఎడ్లు 2679.4 అడుగుల దూరం లాగి ఐదో స్థానం, అర్ధవీడు మండలం గన్నేపల్లికి చెందిన కొమేర నక్షత్ర ఎడ్లు 2565.4 అడుగుల దూరం లాగి ఆరో స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతుల కింద రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.7 వేలు అందజేశారు. పోటీలు తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు.

మళ్లీ కాబోయే సీఎం వైఎస్ జగన్

- పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



చీఫ్ విప్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

పెద్దదోర్నాల: రానున్న ఎన్నికల్లో వైఎస్.జగన్ మోహనరెడ్డి సంపూర్ణ మెజారిటీతో రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శ్రీశైలంలో దైవ దర్శనం ముగించుకుని కుటుంబ సభ్యులతో కలిసి తిరుగు ప్రయాణంలో మాచర్ల వెళ్తూ మార్గమధ్యంలో మండల కేంద్రంలో కొద్ది సేపు ఆగారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు అతిథి గృహంలో కొద్ది సేపు కార్యకర్తలతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ అధిక స్థానాల్లో విజయం సాధించి రెండో సారి ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహనరెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారని అన్నారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలపై కొద్ది సేపు ముచ్చటించారు. చీఫ్ విప్‌ను కలిసిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుమ్మా యల్లేష్, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూదేకుల రసూల్, వెన్నా కాశిరెడ్డి, కర్రా మల్లారెడ్డి, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆత్మ విశ్వాసంతో ఎదగాలి

- మహిళలు అన్నీ రంగాల్లో రాణిస్తున్నారు
- మహిళా సాధికారత మన అందరి బాధ్యత
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి
- పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత



అంగన్‌వాడీ కార్యకర్త ఈశ్వరమ్మను సత్కరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: మహిళలు ఆత్మ విశ్వాసం, ఆశావహ దృక్పథంతో అడుగులు వేస్తూ ఎదగాలని, ఆ దిశగా మహిళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ, మెప్మా, డీఆర్‌డీఏల ఆధ్వర్యంలో శుక్రవారం స్పందన భవనంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జడ్జితో పాటు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జిల్లాన్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే శ్యాంబాబు, నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ అసంబద్ధమైన ధోరణులు అధిగమించి నేడు మహిళలు అన్నీ రంగాల్లో రాణిస్తున్నారని, మహిళా సాధికారత మనందరి బాధ్యత అన్నారు. ఒక మహిళ తన జీవితంలో కూతురుగా, భార్యగా, తల్లిగా, ఉద్యోగిగా ఇలా ఎన్నో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తూ కుటుంబానికి వెన్నుదన్నుగా ఉండటం అభినందనీయమన్నారు. జిల్లాలో 32 మంది న్యాయమూర్తుల్లో 16 మంది మహిళలు ఉన్నారన్నారు. కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. దేశ ప్రగతిని వేగవంతం చేసేందుకే మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మహిళా ఉన్నతి కోసం పెట్టుబడి పెడదాం-పురోగతి వేగవంతం చేద్దాం అనే ఇతివృత్తంతో మహిళా దినోత్సవాన్ని జరుకుంటున్నామన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయం సహాయక సంఘాలే నిదర్శనమన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా వారి సమస్యల పరిష్కారానికి డీఎల్ఎస్ఏ అండగా ఉంటుందన్నారు. మహిళలు బాధితులుగా ఉన్న కేసుల్లో వారికి అవసరమైన సంక్షేమం, ఆర్థిక ప్రయోజనం సత్వరమే అందేలా చూస్తున్నామని చెప్పారు. ఈ కేసులపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీలతో పాటు తాము సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. ఫోక్సో కేసులు గణనీయంగా పరిష్కరించడమే ఇందుకు నిదర్శనమన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ మహిళల సర్వతోముఖాభివృద్ధికి అశాస్త్రీయ కట్టుబాట్లు అడ్డంకిగా ఉండకూడదన్నారు. ఏ రూపంలోనూ మహిళల పట్ల వివక్ష తగదన్నారు. పంట పొలాల్లో కూలీ స్థాయి నుంచి రాజకీయాల్లో ప్రజా ప్రతినిధులుగా మహిళలు రాణించే స్థాయి వచ్చారన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త ఈశ్వరమ్మకు ఘన సత్కారం

సింగరాయకొండ మసీదు వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్న పిట్ట ఈశ్వరమ్మను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శితో పాటు ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్లు ఘనంగా సత్కరించారు. ఈశ్వరమ్మ పెద్ద కుమార్తె కీర్తన సీఏ పూర్తి చేసుకుంది. రెండో కుమార్తె డాక్టర్ నందిని కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో పీజీ చదువుతున్నారు. చిరు ఉద్యోగస్తురాలైనా పిల్లలను కష్టపడి చదివించి ఉన్నత స్థానాలకు తీసుకువెళ్తున్న నేపథ్యంలో మహిళలను ప్రోత్సహించాలంటూ ఆమెను సత్కరించారు. వచ్చే సాధరణ ఎన్నికల్లో తమ ఓటు హక్కును నిస్వార్థంగా వినియోగించుకుని దేశాభివృద్ధిలో తమ బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేరుస్తామని కార్యక్రమంలో పాల్గొన్న వారితో స్వీప్ నోడల్ అధికారులు రవి, జ్యోతి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన మహిళా, శిశు సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ, మెప్మా విభాగాల్లోని మహిళలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సాధికారత పురస్కారాలతో సత్కరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, ఐసీడీఎస్ పీడీ మాధురి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గోవిందమ్మ ఇతర అధికారులు పాల్గొన్నారు.

కమ్మపాలెం వారికీ పట్టాలు..

- పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం
- టీడీపీ, జనసేన, బీజేపీ అన్నీ కట్టకట్టుకొని పోటీకి వస్తున్నాయి
- ఇటు జగన్ మోహన్ రెడ్డి ఒక్కడే ఒంటరి పోరాటం
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి



4వ డివిజన్ ఇస్లాంపేటలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు, మేయర్ గంగాడ సుజాత తదితరులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని కమ్మపాలెంలో 300 మందికి ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. అర్హులు ఎవరైనా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సమానమే. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి చెప్పారు. ఈ మేరకు ఒంగోలు నగరంలోని పలు డివిజన్లలో ఇళ్ల స్థలాల హక్కు పత్రాలకు చెందిన రిజిస్ట్రేషన్ డీడ్‌లు, ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమాలు శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా తొలుత ఇస్లాంపేట, గోపాల్ నగర్‌తో పాటు వివిధ డివిజన్లలో పంపిణీ కార్యక్రమాన్ని బాలినేని సతీమణి శచీదేవితో కలిసి చేపట్టారు. ఇళ్ల పట్టాలతో పాటు లబ్ధిదారులైన దంపతులకు దుస్తులు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ప్రతిపక్ష టీడీపీ నాయకులు మాత్రం ఇళ్ల పట్టాలు వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే ఇస్తున్నారని హైకోర్టులో పిల్ దాఖలు చేశారని మండిపడ్డారు. కమ్మపాలెంలో కూడా అందరూ డబ్బున్నవాళ్లే ఉండరు కదా అని బాలినేని సమాధానం ఇచ్చారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ 16 వేల మంది వద్ద టిడ్కో ఇళ్లకు డబ్బులు కట్టించుకొని 4 వేల ఇళ్లు ఎలా కడతారని నిలదీశారు. ఇళ్లు కట్టకపోయినా పేదల వద్ద కట్టించుకున్న డబ్బులు అయినా తిరిగి చెల్లించాలి కదా అని మండిపడ్డారు. అప్పట్లో నిరుపేదలు కట్టిన డబ్బులను చంద్రబాబు పసుపు..కుంకుమ పేరుతో పందేరం చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఆ నిరుపేదలు చెల్లించిన డబ్బులు తిరిగి చెల్లిస్తున్నామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసికట్టుగా వస్తున్నాయని, అయితే సింహం సింగిల్‌గా వస్తున్నట్లు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒక్కడే వాళ్లతో పోరాటం చేయటానికి సిద్ధమయ్యారని ధీమాగా చెప్పారు. గుంపులు, గుంపులుగా వచ్చినా తాము భయపడేదిలేదన్నారు. చాకలికుంటలో పట్టాలు ఇచ్చేందుకు పోరంబోకు స్థలం కావటంతో సాంకేతికంగా కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని, అయినా కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపారన్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు తాను అలిగి హైదరాబాద్‌లో కూర్చున్నానని పుంఖాను పుంఖాలుగా కథనాలు రాశారని ధ్వజమెత్తారు. ఒనూడా చైర్‌పర్సన్ శింగరాజు మీనా కుమారి వెంకట్రావు మాట్లాడుతూ హైందవ సంప్రదాయం ప్రకారం ఇళ్ల పట్టాలతో పాటు దంపతులకు దుస్తులు కూడా అందించటం వాసన్న ఒక కుటుంబ సభ్యునిలా ఒంగోలులో వ్యవహరిస్తున్నారన్నారు.

మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ బాలినేని దంపతులు ప్రతి కార్యక్రమానికి వచ్చి ఇళ్ల పట్టాలతో పాటు దుస్తులు కూడా అందించటాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని గుర్తు చేశారు. శుక్రవారం నగరంలోని 4, 6, 36, 16, 43, 38, 30 డివిజన్లకు సంబంధించి మొత్తం 2,598 ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలతో పాటు 2,598 దంపతుల జంటలకు దుస్తులు పంపిణీ చేశారు. ముందు బాలినేని దంపతులు పంపిణీ చేసుకుంటూ పోతుంటే వెనుక నుంచి వరుసగా యువనేత ప్రణీత్ రెడ్డి-శ్రీ కావ్య దంపతులు పంపిణీ చేస్తూ వస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్య వైశ్య ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, రాష్ట్ర టైలర్స్ కార్పొరేషన్ చైర్మన్ సుబాన్ బీ, పార్టీ నాయకులు జలీల్, పటాపంజుల అశోక్, కార్పొరేటర్లు షేక్ నూర్జహాన్, చల్లా తిరుమల రావు, ఎందేటి పద్మావతి రంగారావు, శ్రీరామ్ నాగభూషణం, కే చంద్రకళ, ఢాకా సుజాత హనుమా రెడ్డి, ఎం.రమేష్, కండే స్వాతి పాల్గొన్నారు.

కొండపిలో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి సురేష్

- టీడీపీ నుంచి 40 కుటుంబాలు చేరిక
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి సురేష్

సింగరాయకొండ (మర్రిపూడి): కొండపిలో వైఎస్సార్‌సీపీ జెండా భారీ మెజారిటీతో ఎగురవేయటం ఖాయమైందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ధీమా వ్యక్తం చేశారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని చంద్రబాబు నాయుడు కాలనీలో శుక్రవారం రాత్రి టీడీపీ నుంచి భారీగా వైఎస్సార్ సీపీలో చేరికల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సురేష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు ఈసారి కూడా ఫ్యాను ప్రతి ఇంట్లో తిరుగుతుందని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావటం ఖాయమన్నారు. వైఎస్సార్ సీపీలో రాజకీయ విలువలు, స్వేచ్ఛా స్వాతంత్ర్యం ఎలా ఉంటుందో తాను రుచి చూపిస్తానన్నారు. ప్రజలతో పొత్తు పెట్టుకుంటే ఆ పార్టీ చిరస్థాయిగా ఉంటుందని జగనన్న ఇప్పుడు ప్రజలతో పొత్తు పెట్టుకుంటున్నాడన్నారు. రాబోయే రోజుల్లో పార్టీలో చేరికలు బాగా ఉంటాయని ఎన్నికల నాటికి చంద్రబాబు నాయుడు కాలనీలో టీడీపీ ఖాళీ అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాలు ఇప్పించి ఇళ్లు కూడా కట్టిస్తానని భరోసా ఇచ్చారు. కాలనీలో మహిళలకు ఉపాధి కోసం కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించనున్నట్లు వివరించారు. రాబోయే ఎన్నికలలో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర రెడ్డికి ఓటు వేయాలని మంత్రి సురేష్ విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు

ఇటీవల టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన షేక్ జిలానీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు షేక్ పటేల్, షేక్ సలీంబాషా సహకారంతో సింగరాయకొండ పంచాయతీ చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన 40 కుటుంబాలు పార్టీలో చేరినట్లు మంత్రి సురేష్ ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టి లో చేరిన ఇ రమణి, షేక్ మీరాబీ, షేక్ మస్తాన్‌బీ, షేక్ అబ్బా, షేక్ సుల్తాన్, షేక్ దిల్‌షాద్, షేక్ సుల్తాన్,షేక్ ముంతాజ్, షేక్ హసీనా, షేక్ అప్సానా, షేక్ షాహీనా, షేక్ ఖమ్‌రున్, షేక్ ఖైరున్, షేక్ రహీమా, షేక్ అమీనా, షేక్ మహబూబ్ జాన్, షేక్ యలమందమ్మ,షేక్ గుల్జార్, షేక్ దేవీ, తన్నీరు అంకమ్మ, షేక్ బేగం, షేక్ కరిమున్,షేక్ సమీరా, కమల, షేక్ మహబూబీ, రమణ, షేక్ మస్తాన్, షేక్ మహబూబ్ బాషా, పఠాన్ మస్తాన్‌ఖాన్, షేక్ సత్తార్, షేక్ కరిముల్లా, టి రాజు, షేక్ మక్బూల్, షేక్ సంధాని, షేక్ నాయబ్‌రసూల్, షేక్ సుభాని, సయ్యద్ షోహన్, షేక్ మానిక్‌భాషాలకు మంత్రి సురేష్ పార్టి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, షేక్ కరీం, షేక్ నౌషాద్, షేక్ నియాజ్, సయ్యద్ అబిద్‌అలీ, షేక్ అల్లాభక్షు, షేక్ రఫీ, షేక్ ఇంతియాజ్, షేక్ ముజీబ్, షేక్ జావీద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహం

- రాష్ట్రస్థాయి హాకీ మహిళల క్రీడా పోటీలు ప్రారంభం
- రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి పాల్గొన్న హాకీ క్రీడాకారిణిలు
- 8 నుంచి 10వ తేదీ వరకు మైనంపాడులో పోటీల నిర్వహణ



క్రీడాపోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పోటీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలు ప్రాంగణంలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న 14వ రాష్ట్రస్థాయి హాకీ సీనియర్ మహిళల క్రీడా పోటీలను మంత్రి మేరుగు నాగార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజునే మహిళల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు తన అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో జరగటం చాలా సంతోషంగా ఉందన్నారు. పోటీల్లో మహిళలు తమ ప్రతిభ చాటి రాణించాలన్నారు. తొలుత వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారిణులతో ప్రదర్శించిన పరేడ్‌లో మంత్రి నాగార్జున గౌరవ వందనం స్వీకరించారు. ఈ పోటీలు 8 నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి.

మొదటి రోజు విజేతల జట్లు వివరాలు

మొదటి రోజు నిర్వహించిన హాకీ పోటీల్లో 7 జట్లు పాల్గొన్నాయి. మొదటి మ్యాచ్‌లో కాకినాడ-ఏలూరు జట్లు పోటీపడగా కాకినాడ జట్టు విజేతగా నిలిచింది. రెండో మ్యాచ్‌లో తిరుపతి-కర్నూలు జట్లు పోటీపడగా తిరుపతి జట్టు విజేతగా నిలిచింది. మూడో మ్యాచ్‌లో వైఎస్సార్ కడప-గుంటూరు జట్లు పోటీపడగా వైఎస్సార్ కడప జట్టు విజయం సాధించింది. నాలుగో మ్యాచ్‌లో ప్రకాశం-ఎన్టీఆర్ జిల్లాల జట్లు పోటీపడగా ప్రకాశం జట్టు విజేతగా నిలిచింది. 5వ మ్యాచ్‌లో నెల్లూరు-శ్రీకాకుళం జట్లు పోటీపడగా శ్రీకాకుళం జట్టు గెలిచింది. 6వ మ్యాచ్‌లో తిరుపతి-ఏలూరు జట్లు పోటీపడగా తిరుపతి జట్టు విజయం సాధించింది. 7వ మ్యాచ్‌లో కాకినాడ-కర్నూలు జట్లు పోటీపడగా కాకినాడ విజేతగా నిలిచిందని పోటీల నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఏపీ హాకీ అధ్యక్షుడు చాణక్యరాజు, ట్రెజరర్ థామస్ పీటర్, డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు పాల్గొన్నారు.

సిద్ధం సభకు పటిష్ట బందోబస్తు

- గుంటూరు రేంజి ఐజీ పాల్‌రాజ్ సూచనలు

మేదరమెట్ల: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పీ.గుడిపాడు జాతీయ రహదారి సమీపంలో ఈనెల 10వ తేదీ నిర్వహించనున్న సిద్ధం సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్న సందర్భంగా పోలీసు అధికారులు పటిష్ట బందోబస్తు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు గుంటూరు రేంజి ఐజీ పాల్‌రాజ్, అడ్మిన్ ఐజీ ఎం.రవీంద్రనాద్‌బాబు, ఎస్పీ వకుల్ జిందాల్ మేదరమెట్లలో శుక్రవారం పోలీసు అధికారుల సమావేశంలో వెల్లడించారు. జిల్లా పోలీసు అధికారులు తీసుకుంటున్న బందోబస్తు గురించి ఎస్పీ వివరించారు. సిద్ధం సభకు మొత్తం 10 లక్షలకు పైగా ప్రజలు హాజరవుతారని, సభకు వచ్చే వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు, సభ నిర్వహణకు మొత్తం 338 ఎకరాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఐజీ మాట్లాడుతూ సిద్ధం సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరవుతున్న సందర్భంగా వాహనాలను దారి మళ్లింపు విషయంలో ప్రజలకు అర్థమయ్యేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ, ప్రకాశం జిల్లా ఎస్పీ పీ.పరమేశ్వరరెడ్డి, నెల్లూరు జిల్లా ఎస్పీ డాక్టర్ కే.తిరుమలేశ్వరరెడ్డి, పాల్గొన్నారు.




జమ్ములపాలెంలో 1116 శివలింగాలను దర్శించుకుంటున్న భక్తులు, (ఇన్‌సెట్లో) పంచముఖేశ్వరుడు



పెద్దారవీడు : ప్రత్యేక అలంకరణలో శివయ్య



భైరవకోనలో స్వామివారి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు





ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్‌లోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో అలంకరణలో ఉత్సవమూర్తులు




ఒంగోలు సంతపేట శివాలయంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులతో ప్రత్యేక పూజలు చేయిస్తున్న మఠంపల్లి దక్షిణామూర్తి, ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ దంపతులు



ఒంగోలు : శంభో హరహర అంటూ మొక్కుతున్న భక్తులు



ఆరాధ్య దైవానికి పాలాభిషేకం

హరహర మహాదేవ...

ఓం నమఃశివాయ.. హరహర మహాదేవ..శంభోశంకర నామస్మరణ మార్మోగింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ వెల్లి విరిసింది. శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రధాన ఆలయాల వద్ద భారీ క్యూలు కనిపించాయి. శివలింగాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భైరవకోనలో భక్తులు బారులుదీరారు. త్రిపురాంతకం బాలాత్రిపురసుందరీదేవి, శ్రీపార్వతీ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయాలకు పోటెత్తారు.

- ఒంగోలు మెట్రో



పొదిలి శివాలయంలో ఎస్పీ పరమేశ్వరరెడ్డి



కొనకనమిట్ల : బ్రాహ్మణపల్లిలో శివుని దర్శనం కోసం..



పొదిలి శివాలయంలో భారీగా భక్తులు



ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్ వద్ద కిక్కిరిసిన రాజరాజేశ్వరస్వామి ఆలయం



ఒంగోలు సంతపేట సాయిబాబా ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు

క్లుప్తంగా

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి...

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు: మహిళలు ఆర్థికంగా ఎదిగి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, తద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో న్యాయమూర్తులకు, న్యాయశాఖ సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. మహిళల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక న్యాయస్థానాలు, ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. వాటిపై అవగాహన పొంది సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు ఎం ఏ సోమశేఖర్, డి.అమ్మనరాజా, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తి హేమలత, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు శిల్ప, భానుసాయి రాధిక, వెంకటేశ్వరశర్మ, వివిధ న్యాయస్థానాల సూపరింటెండెంట్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

త్రిపురాంతకం: జాతీయ రహదారిపై వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. త్రిపురాంతకం మండలం దూపాడు సమీపంలో రెండు బొలేరో వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో యర్రగొండపాలెం మండలం తమ్మడపల్లికి చెందిన వ్యవసాయ కార్మికురాలు గోపిదేశి గంగమ్మ (70) మిర్చి కోతలకు వెళ్తూ అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ సాయి గాయపడ్డాడు. మరో ప్రమాదంలో శ్రీనివాసనగర్ వద్ద అల్లూరి జిల్లా చింతపల్లికి చెందిన కంచర్ల హరికృష్ణ మృతి చెందాడు. ఏ స్వామి గాయపడ్డాడు. వీరు శ్రీశైలం వెళ్లి కారులో తిరిగి వెళుతుండగా మార్కాపురంవైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ రెండు ప్రమాదాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విషం తాగి వ్యక్తి ఆత్మహత్య

మార్కాపురం: విషం తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర్‌లో జరిగినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ శుక్రవారం రాత్రి తెలిపారు. పెద్దదోర్నాల మండలం పెద్దబొమ్మలాపురం గ్రామానికి చెందిన షేక్ పెద్దవలి (46) మార్కాపురం పట్టణంలో ఒక చికెన్ షాప్‌లో పనిచేస్తున్నారు. మద్యానికి బానిసై గురువారం రాత్రి మద్యం సేవించి దాంతో పాటు విషం కూడా సేవించి ఇంటికి వచ్చి నిద్రపోయాడు. ఎంతసేపటికీ నిద్రలేవకపోవడంతో కుటుంబ సభ్యులు గమనించి వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జగనన్న సారథ్యంలోనే మహిళాభ్యున్నతి

- ప్రతి పథకంలో మహిళలకే అత్యధిక భాగస్వామ్యం
- ఇంటి పట్టాలు కూడా మహిళల పేరుమీదే పంపిణీ
- రాబోయే ఎన్నికల్లో విశ్వాసాన్ని చూపి వైఎస్సార్ సీపీని గెలిపించుకుందాం
- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో బాలినేని శచీదేవి



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బాలినేని శచీదేవి, మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్‌పర్సన్ మీనావెంకట్రావు, తదితరులు

ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోనే మహిళాభివృద్ధి సాధ్యమైందని స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో మహిళలకు ప్రత్యేక స్థానం లభించిందన్నారు. ప్రతి పథకంలో మహిళలను భాగస్వాములను చేయడమే కాకుండా మహిళల కోసం అనేక ప్రత్యేక పథకాలు తీసుకొచ్చారన్నారు. మహిళలు ఆర్థికంగా రాణించినప్పుడే సామాజికంగా, రాజకీయంగా ముందుడుగు వేసే అవకాశం ఉందని భావించి ఆ దిశగా ప్రతి ఒక్క పేద మహిళకు ఇంటి పట్టా ఉచితంగా కేటాయించడమే కాకుండా తొలిసారిగా దేశ చరిత్రలోనే రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ అటువంటి సంక్షేమ పథకాలు ప్రతి పేదింటి మహిళకు అందాలంటే వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. రాష్ట్రంలో జగనన్న, ఒంగోలులో వాసన్నను గెలిపించుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ విశ్వసనీయత చాటాలని, అందుకు మహిళలంతా వాసన్న సైన్యంగా మారి రాబోయే ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. మహిళలకు ఏదైనా మంచి జరిగినా, లేక మంచిని ఎవరైనా చేసినా దానిని పదిమందికి చెప్పుకోవడం అలవాటని అన్నారు. ఈ నేపథ్యంలో మనకు జరిగిన మంచిని మనం పదిమందికి చెబుతూ వాసన్న, జగనన్న గెలుపులో భాగస్వాములం అవుదామని పిలుపునిచ్చారు. వాసన్న నిత్యం మనకు అందుబాటులో ఉండే నాయకుడని గమనించాలన్నారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ సింగరాజు మీనాకుమారి మాట్లాడుతూ అన్ని రంగాలలో మహిళలు పురోగతి సాధించడం ఆనందంగా ఉందన్నారు. రాజకీయ రంగంలో మహిళలు మరింత పురోగతి సాధించేందుకు నేడు పురుషుల నుంచి లభిస్తున్న ప్రోత్సాహం అహ్వానించదగిన పరిణామం అన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో ప్రతి డివిజన్‌లో 2 నుంచి 7 కోట్ల రూపాయల మేర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అయితే, ప్రత్యర్థి పార్టీలు కేవలం నోటిమాటగా వాస్తవాన్ని అవాస్తవంగా ప్రచారం చేస్తున్నాయని, ఈ నేపథ్యంలో వాసన్న సైన్యంగా మనం వాటిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. మహిళలు విశ్వసనీయతకు పెట్టింది పేరని, ఆ విషయాన్ని నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాసన్న చివరిసారిగా పోటీ చేసే ఈ ఎన్నికల్లో ఆయనను శాసనసభ్యునిగా మనం గెలిపించుకుందామని, ఇప్పటికే జగనన్న కూడా వాసన్నను మంత్రి అంటూ ప్రకటించిన విషయాన్ని ప్రజలు గమనించాలని అన్నారు. ఏపీ టైలర్స్ వెల్ఫేర్ బోర్డు చైర్‌పర్సన్ షేక్ సుభాన్‌బీ మాట్లాడుతూ విద్యార్జన ద్వారానే మహిళలు ఎదగడం సాధ్యపడుతుందని, తద్వారానే సామాజిక అభివృద్ధి జరుగుతుందని చెప్పిన సావిత్రీభాయి పూలేకు ప్రతి ఒక్కరం రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, పరుగుపందెం పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు చింతగుంట్ల సువర్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుజాతారెడ్డి, బైరెడ్డి అరుణ, పురిణి ప్రభావతి, ఏపీ మేదర కార్పొరేషన్ చైర్మన్ కేతా లలిత నాంచారమ్మ, కావూరి సుశీల, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నారపరెడ్డి వసుంధర, బొమ్మరిల్లు రాజేశ్వరి, ఆటో డ్రైవర్ తిరుపతమ్మ, ఆర్టీసీ కండక్టర్ నూకతోటి శ్రీదేవి, ఫెన్సింగ్ క్రీడాకారిణులు విజయలక్ష్మి, జాహ్నవిలను ఘనంగా సత్కరించారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



ఎమ్మెల్యే బాలినేని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న ప్రైవేటు పారామెడికల్ స్టాఫ్



ఆలూరు నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు

ఒంగోలు:

వైఎస్సార్ సీపీలోకి శుక్రవారం భారీగా చేరికలు జరిగాయి. వారందరికీ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో పారామెడికల్ స్టాఫ్‌గా పనిచేస్తున్న వారు శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ స్థానిక మూడో క్లస్టర్ ఇన్‌చార్జి గంటా రామానాయుడు ఆధ్వర్యంలో బాలినేని నివాసానికి చేరుకుని బాలినేని చేతులమీదుగా పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారిని బాలినేని ఆత్మీయంగా ఆహ్వానించారు. ఇంటి పట్టాలు లభించాయా అని అడిగి తెలుసుకున్నారు. పట్టాలు ఇవ్వరని టీడీపీ నాయకులు ప్రచారం చేస్తుంటే నిజమే అనుకుని దరఖాస్తు చేసుకోలేదని, తీరా ఇప్పుడు పంపిణీ చేస్తుంటే తాము టీడీపీ వారి మాటలు నమ్మి మోసపోయామని అర్థం అవుతుందని కొంతమంది ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పట్టాల పంపిణీ జరిగిందని, ఎన్నికల అనంతరం మళ్లీ అర్హులైన పేదవారికి పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. అధైర్యపడాల్సిన అవసరం లేదని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అంతేగాకుండా ప్రైవేటు ఆస్పత్రుల్లో కొద్దిపాటి జీతాలకు పనిచేసే పారామెడికల్ స్టాఫ్‌కు కూడా ఆరోగ్యబీమాను చారిటీ సంస్థ ద్వారా కల్పించేందుకు కృషిచేస్తామన్నారు. ఎన్నికల తర్వాత ఒక కార్పొరేట్ ఆస్పత్రి నిర్మించి ఒంగోలులో పేదలకు అతి తక్కువ ధరకు నాణ్యమైన వైద్యం అందించాలని తనకు కోరిక ఉందని బాలినేని వెల్లడించారు. అందులో పారామెడికల్ స్టాఫ్‌కు కూడా మంచి జీతాలతో ఉద్యోగాల కల్పన చేయాలనే ఆకాంక్ష ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ వైఎస్సార్ సీపీ విజయంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాజు, రాజా వినోద్, సుకుమార్, బాలకృష్ణ, సుకుమార్, నరేంద్ర, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు నుంచి వైఎస్సార్ సీపీలోకి...


కొత్తపట్నం మండలం ఆలూరు గ్రామం నుంచి 10 టీడీపీ కుటుంబాలు శుక్రవారం బాలినేని నివాసంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. ఆలూరు వైఎస్సార్ సీపీ నాయకులు జానకిరామ్‌రెడ్డి, ఎంపీటీసీ దొడ్ల రాజగోపాల్‌రెడ్డి, కొల్లి వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ గెలుపు కోసం పనిచేస్తామని బాలినేనికి వారు తెలిపారు.

సాయుధ బలగాల మార్చ్‌ఫాస్ట్

ఒంగోలు సబర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు శుక్రవారం ఒంగోలు నగరంలో పోలీసు కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ పీ పరమేశ్వరరెడ్డి నేతృత్వంలో ఒంగోలు డీఎస్పీ ఎం.కిషోర్‌బాబు ఆదేశాలతో ఉదయం ఒంగోలు టూ టౌన్, సాయంత్రం ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసు కవాతు నిర్వహించారు. ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు కేంద్ర పోలీస్ బలగాలతో ప్రధాన వీధుల్లో పర్యటించారు. కొత్తపట్నం బస్టాండ్, కమ్మపాలెం, గోపాల్ నగర్, అద్దంకి బస్టాండ్ సెంటర్లతో పాటు ఉత్తర బైపాస్ నుంచి పాత గుంటూరు రోడ్డు, కర్నూల్ రోడ్డు, ముంగమూరు రోడ్డు, ప్రధాన వీధుల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు జగదీష్, భక్తవత్సల రెడ్డి మాట్లాడుతూ ప్రజలు రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన ఓటు హక్కును వినియోగించుకోవడానికి నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు రావాలన్నారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

మార్కాపురంలో

మార్కాపురం: త్వరలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు శుక్రవారం మార్కాపురం పట్టణంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభమైన మార్చ్‌ఫాస్ట్.. పాత బస్టాండు, నాయుడు వీధి, తేరు బజారు, మెయిన్ బజారు, కంభం బస్టాండు మీదుగా సాగింది. పట్టణ సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ, రూరల్ ఎస్సై అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్వరనాయక్, బీఎస్ఎఫ్ అసిస్టెంటు కమాండెంట్, 60 మంది పారా మిలటరీ బలగాలు పాల్గొన్నారు.



ఒంగోలు : కేంద్ర పోలీస్ బలగాలతో కవాతు